టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 11: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం ధూళిమిట్టలోని ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి, పదో తరగతి విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌తో పాటు పరీక్షా విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని విషయాలను క్షుణ్ణంగా చదివి మనోధైర్యంతో పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎనిమిదో తరగతిలో ఎన్ఎంఎంఎస్ సాధించిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలోని వివిధ సబ్జెక్టులకు చెందిన ల్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దూరు(ధూళిమిట్ట): విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

అక్కన్నపేట: గౌరవెల్లి ఉపాధ్యాయులతో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

పాఠశాలను సందర్శించిన డీఈవో

అక్కన్నపేట, మార్చి 11: మండలంలోని గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఏకాగ్రతతో చదువుకొని వందశాతం ఉత్తీర్ణత సాధించాలని టెన్త్ విద్యార్థులకు సూచించారు. పోటీ పరీక్షల్లో విద్యార్థులు పాటించాల్సిన మెళకువల గురించి వివరించారు. పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. అనంతరం పాఠశాలకు చెందిన విద్యార్థులు వివిధ క్రీడల్లో రాణిస్తుండగా వారిని మెచ్చుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు జంగపల్లి వెంకటనర్సయ్య క్రీడారంగంలో అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏంఈవో రంగనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలి

- విశ్రాంత ఉపాధ్యాయుడు తిగుళ్ల సుధాకర్‌శర్మ

పదోతరగతి విద్యార్థులకు ఎగ్జామ్‌కిట్ అందజేస్తున్న తిగుళ్ల సుధాకర్‌శర్మ

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 11: విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలని విశ్రాంత ఉపాధ్యాయుడు తిగుళ్ల సుధాకర్‌శర్మ విద్యార్థులకు సూచించారు. మంగళవారం ధూళిమిట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్యాల పట్టణం ప్రధాన కేంద్రంగా నడుస్తున్న 'సద్గురు సదనం', విశ్రాంత ఉపాధ్యాయుడు తిగుళ్ల సుధాకర్‌శర్మ సంయుక్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను కోరుతూ బాసరలో జ్ఞాన సరస్వతీమాత సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి ఎగ్జామ్ కిట్ (ప్యాడ్, పెన్నుల సెట్)ను విద్యార్థులకు అందజేశారు. సుధాకర్‌శర్మ పాఠశాల విద్యార్థుల అవసరాల కోసం రూ. 5వేల నగదును హెచ్ఎం కరుణాకర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌శర్మ మాట్లాడుతూ పాఠశాలకు అందజేసిన రూ. 5వేలతో విద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేయాలని సూచించారు. కష్టపడి చదువుకుంటే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చన్నారు. విద్య అనేది ఎప్పటికీ తరగని ఆస్తి అన్నారు. తిగుళ్ల రామ్మూర్తిశర్మ, మాజీ ఉపసర్పంచ్ పోతరాజుల మధు, గుంటిపల్లి సుధాకర్, నాచగోని మహేశ్, తుపాకుల రాజు, అజయ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డికి ఐజీ సన్మానం

విశ్రాంత ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఐజీ రమేశ్

గజ్వేల్, మార్చి 11: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా రిటైర్డు అయిన తొందురు బాల్‌రెడ్డి 19సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా పాఠాలు బోధిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు ఉచితంగా తనవంతు విద్యాబోధన చేస్తున్నాడు. రోజూ గజ్వేల్ నుంచి సొంత ఖర్చులతో తన స్వగ్రామం తిగుల్‌కు వెళ్లి అక్కడి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పదేండ్లుగా పాఠాలు బోధిస్తున్నాడు. రిటైర్డు అయిన తర్వాత గజ్వేల్ మండలం క్యాసారం, దాచారం, ప్రజ్ఞాపూర్, తిమ్మక్కపల్లి పాఠశాలల్లో బోధన చేశాడు. పేద విద్యార్థులకు బాల్‌రెడ్డి ఉచితంగా పాఠాలు చెబుతున్న విషయం తెలుసుకున్న ఐజీ రమేశ్ మంగళవారం రాత్రి గజ్వేల్‌లోని ఆయన ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఐజీ రమేశ్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే వయస్సులో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు పాఠాలు బోధించాలనే ఆసక్తితో 19ఏండ్లుగా ఆయన నిర్విరామంగా ఉచితంగా పాఠాలు బోధించడం అభినందనీయమన్నారు. సమాజంలో బాల్‌రెడ్డిలాగే రిటైర్డు అయిన ఉద్యోగులు సమాజానికి ఎంతో కొంత సేవ చేయడానికి ముందుకొస్తే బాగుంటుందన్నారు.

రహదారి దిగ్బంధానికి అనుమతి ఇవ్వాలి

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 11: ఈనెల 13న చేపట్టిన రాజీవ్ రహదారి దిగ్బంధానికి అనుమతి ఇవ్వాలని మంగళవారం బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ4 కెనాల్ ద్వారా కొండపాక మండలంలోని 11 గ్రామాల చెరువులు నింపి పంటలు కాపాడాలన్నారు. రైతుల ఉసురు కాంగ్రెస్ పార్టీకి తగలడం ఖాయమన్నారు. రైతు బంధు సమితి మండల మాజీ కో ఆర్డినేటర్ దుర్గయ్య, మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్, రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

రేపు మల్లన్న ఆలయంలో టెండర్లు

చేర్యాల, మార్చి 11: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఈ నెల 13న వివిధ అంశాలకు సంబంధించి సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెల్‌ఫోన్లు భద్రపర్చుకునే లైసెన్స్ హక్కు, రాతిగీరల పక్కన షాపింగ్ కాంప్లెక్స్ షాపులో తాత్కాలిక లైసెన్స్ పద్ధతి పై వ్యాపారం చేసుకునే హక్కు(షాపు నెం 2 నుంచి 26 వరకు), అన్నదాన సత్రం ముందు దేవాలయ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులో తాత్కాలిక లైసెన్స్ పద్ధతి పై వ్యాపారం చేసుకునే హక్కు (షాపు నెం.1 నుంచి 10 వరకు), ప్రసాదాల కౌంటర్ పక్కన పూజ సామగ్రి అమ్ముకునే లైసెన్స్ హక్కులకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు సీల్డ్ టెండరు కమ్ బహిరంగ వేలంలో పాల్గొనాలన్నారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో ఆదివారం సందర్భంగా రూ. 58,39,513 ఆదాయం వచ్చిందన్నారు.గత సంవత్సరం ఇదే ఎనిమిదో ఆదివారానికి రూ.46,87,250 వచ్చిందని గతంలో పోలిస్తే రూ.11,52,263 అధిక ఆదాయం స్వామి వారి ఖజానాకు సమకూరినట్లు తెలిపారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

అక్కన్నపేట: మార్చి 11: వయస్సుతో సంబంధం లేకుండా వచ్చే వ్యాధుల నుంచి ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ స్కూల్ ఐ స్క్రీనింగ్ ప్రోగ్రాం, శంకర కంటి దవాఖాన ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కంటి క్యాంపులో 304 మందికి స్క్రీనింగ్ చేయగా, 129 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు గుర్తించారన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు సహజ పద్ధతులు పాటించాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, ప్రొటిన్లు ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, డీఎంహెచ్‌వో పల్వాన్, ఆర్డీవో రామ్మూర్తి, ఇతర వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా

హుస్నాబాద్‌టౌన్, మార్చి 11: హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానని బీసీసంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరితోపాటు పలువురు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

కోహెడ, మార్చి 11: కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని బస్వాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్ఫినేటివ్ విద్యా ఫౌండేషన్ సహకారంతో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్‌లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో దేవకీదేవి, ఆర్డీవో రాంమూర్తి, ఎంఈవో పద్మయ్య, ఇన్ఫినేటివ్ విద్యా ఫౌండేషన్ చైర్మన్ కృష్ణారెడ్డి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ


మద్దూరు(ధూళిమిట్ట): స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), మార్చి 11: విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మంగళవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఘనంగా స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వల్లంపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో..

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి11: మద్దూరు మండలంలోని వల్లంపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పాతిమారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, రజిత, శ్రీలత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలి

ఏసీపీ కార్యాలయాన్ని పోలీస్ అధికారులతో కలిసి ప్రారంభిస్తున్న పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌టౌన్, మార్చి 11: నేరస్తులపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని బీసీ సంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హుస్నాబాద్‌లో 2.84కోట్లతో నూతనంగా నిర్మించిన ఏసీపీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేరస్తులపై కఠినంగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసులకు సూచించారు. నేరస్తులకు ఫ్రెండ్లీ పోలీసు కాదనేది మా ప్రభుత్వ విధానమనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పోలీసులు ప్రజలకు న్యాయం జరిగే విధంగా పనిచేయాలని, సమస్య ఉంటే నేరుగా పోలీసులకు వచ్చి చెప్పుకునే విధంగా ఉండాలన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది శాంతిభద్రతలు కాపాడుతున్నారని ఆయన కొనియాడారు. తెలంగాణ రాష్ట్రపోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రమేశ్ మాట్లాడుతూ ఇక్కడ పనిచేసే అధికారులు ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, పోలీసు కమిషనర్ అనురాధ, అడిషనల్ డీసీపీ సుభాశ్ చంద్రబోస్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీఐ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఎస్సైమహేశ్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అగ్గితెగులును అరికట్టవచ్చు

రైతుకు సూచనలు చేస్తున్న పద్మ, శ్రీనాథ్

సిద్దిపేట అర్బన్, మార్చి 11: వరి పైరుకు వచ్చిన అగ్గితెగులును సస్యరక్షణ చర్యలతో అరికట్టవచ్చని సిద్దిపేట ఏడీఏ పద్మ, మండల ఏవో శ్రీనాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని వెల్కటూర్‌లో అగ్గి తెగులు సోకిన వరి పైరును పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. రాత్రి ఉష్ణోగ్రత తక్కువగా ఉండటం, ఆకులపై మంచు ప్రభావం, నత్రజని అధిక వినియోగం వల్ల వరిలో అగ్గి తెగులు వస్తుందన్నారు. ఆకులపైన నూలు కండె ఆకారంలో బూడిదరంగు మచ్చల చుట్టూ ఇటుక రంగులో ఉండే అగ్గితెగులు లక్షణాలను ప్రారంభదశలోనే గుర్తించి నివారించకపోతే తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయన్నారు. నివారణ కోసం ట్రైసైక్లాజోల్ 120 గ్రా. లేదా ట్రిఫ్లాక్సిస్ట్రోబిన్, టెబుకొనజోల్ 90 గ్రా. ద్రావణాన్ని లేదా పికాక్సిస్ట్రోబిన్, ట్రైసైక్లాజోల్ 400 మి.లీ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారీ చేసుకోవాలని సూచించారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

కొండపాకలో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాధిక, తదితరులు

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 11: కొండపాక మండల కేంద్రంలో మంగళవారం పలువురు రైతుల పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి రాధిక సందర్శించారు. ఈ సందర్భంగా బోర్లలో నీటి లభ్యత తగ్గిందని, పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు అదిస్తున్నా సరిపోవడం లేదని వ్యవసాయాధికారులతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాసంగిలో వరి పంట కాకుండా తక్కువ నీటితో సాగుచేసే మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, కూరగాయ పంటలు సాగుచేసి అధిక లాభాలు పొందాలని రైతులకు సూచించారు.కొండపాకతో పాటు మర్పడగ గ్రామాల్లో గజ్వేల్ ఏడీఏ బాబు, ఏవో శివరామకృష్ణతో కలిసి పత్తి, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

సిద్దిపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేట, మార్చి 11: బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల అభిషేక్ భాను, ఆముదాల రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెలలో జరగనున్న బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. రీయింబర్స్‌మెంట్ ఆగిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోనేరు ప్రవీణ్ కుమార్, నాయకుడు విక్రం పాల్గొన్నారు.

సామాజిక సమస్యలపై అవగాహన ఉండాలి

సిద్దిపేట టౌన్,మార్చి 11 : సామాజిక సమస్యలపై అవగాహన ఉండాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కృష్ణ చైతన్య విద్యార్థులకు సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రాజెక్టుల తయారీ, పరిశోధన అనే అంశాలపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిపుణులైన అధ్యాపకుల పర్యవేక్షణలో నాణ్యమైన ప్రాజెక్టులు రావడం వల్ల భవిష్యత్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మాట్లాడుతూ.. విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకొని ఉత్తమ ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. అంతకుముందు ప్రాజెక్టు రూపకల్పనలో పాటించాల్సిన మెళకువలు, నివేదికలు తయారుచేసి సమర్పించాల్సిన విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, అధ్యాపకులు గోపాల సుదర్శనం, గురచరణ్ దాస్, ఉమామహేశ్వరి, శ్రీనివాస్, సులేమాన్ అహ్మద్ పాల్గొన్నారు.

సాంకేతికరంగాలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రఘునందన్‌రావు

మిరుదొడ్డి, మార్చి 11: సాంకేతిక రంగాల పై ఆసక్తి పెంపొందించుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్‌రావు విద్యార్థులకు సూచించారు. కేంద్రం ఇటీవల నిర్వహించిన ప్రాజెక్టు నమూనాలకు అల్వాల-చెప్యాల గ్రామాల శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి నితిన్ ఎంపికయ్యాడు. మంగళవారం ప్రిన్సిపాల్ విద్యార్థిని అభినందించి మాట్లాడారు. విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. నితిన్ రూపొందించే ప్రాజెక్టు కోసం కేంద్రం రూ.10 వేలు మంజూరు చేస్తుందన్నారు. నమూనాను ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారని తెలిపారు.

సనాతన ధర్మరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

సందేశమిస్తున్న సద్గురు మహాదేవ స్వామి

చేర్యాల, మార్చి 11: సనాతన ధర్మరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సద్గురు మహాదేవ స్వామి అన్నారు. ఆదిజగద్గురు రేణుకాఆచార్య జయంతి సందర్భంగా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తెలంగాణలోని వివిధ గ్రామాల నుంచి 1200 మందితో ప్రారంభమై మహాపాదయాత్ర మంగళవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లికి చేరుకుంది.ఈ సందర్భంగా పాదయాత్రగా వచ్చిన భక్తులు మల్లికార్జునస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తిరుమల తిరుపతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ధర్మసభలో సద్గురు మహాదేవ స్వామి మాట్లాడారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక క్షేత్రంలోని ఆదిజగద్గురువులు రేణుకాఆచార్య జయంతిని పురస్కరించుకుని మహాపాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. జగద్గురు రేణుకా ఆచార్యులు కొలనుపాక పుణ్యక్షేత్రంలోని అన్ని కులాలకు చెందిన 18 మఠాలను స్థాపించినట్లు తెలిపారు. జయంతి సందర్భంగా సోమనాథ స్వయం భూలింగ దర్శనం కోసం ధర్మప్రియులైన భక్తు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తెలంగాణ రాష్ట్ర మీదుగా కొలనుపాక వెళ్లనున్నట్లు తెలిపారు. గో సంరక్షణకు అందరూ నడుం బిగించాలని తెలిపారు. మాతృదేశం, తల్లిదండ్రులను దైవంతో సమానంగా ఆరాధించాలని మనిషికి ధ్యానంతోనే ప్రశాంత కలుగుతుందన్నారు. ప్రతి జీవిలో పరమాత్ముడిని దర్శించుకోవాలన్నారు. అనంతరం మహాదేవ స్వామిజీని వీరశైవ లింగాయత్ సభ్యులు సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, వీరశైవ సమాజం రాష్ట్ర నాయకులు మహదేవుని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు పడిగన్నగారి నాగయ్య, మల్లన్న ఆలయ స్థానాచార్యులు పడిగన్నగారి మల్లయ్య, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, కొమురవెల్లి మల్లన్న ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, ఆలయ అర్చకులు మహాదేవుని భాస్కర్, రవి, మనోహర్, వినయ్‌కుమార్, సూర్యకుమార్, రేవన సిద్దేశ్వర్, శివకుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

సిద్దిపేట అర్బన్: నిరసన దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బెజ్జంకి: నిరసన దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సిద్దిపేట అర్బన్, మార్చి 11: అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఉద్యోగ నియామకాలు చేపడుతామని హామీ ఇచ్చి నేడు టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్ 1, 2, 3 పరీక్ష ఫలితాలు విడుదల చేయడం ద్వారా మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతుందని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురామ్ మాదిగ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ.. 30ఏండ్ల పోరాటం తర్వాత సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం నిండు అసెంబ్లీలో మాట ఇచ్చి నేడు తప్పినందుకు నిరసన దీక్ష చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, యాదగిరి, ప్రకాశ్, రమేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

బెజ్జంకిలో...

బెజ్జంకి, మార్చి 11: వివిధ గ్రూపు పరీక్షల ఫలితాలు నిలుపుదల చేయాలని కోరుతూ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు వడ్లూరి పరశురాములు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. నాయకులు పరశురాములు, భూమయ్య, రాజు, చంద్రయ్య, అంజయ్య, రాజయ్య, భూపేందర్ పాల్గొన్నారు.

కవితకు సన్మానం

రాయపోల్, మార్చి 11: వరల్డ్ రికార్డు సృష్టించిన విద్యార్థినిని టీపీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. మండలంలోని బేగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పంజాల కవిత ఈనెల 8న తమిళనాడులో జరిగిన ఆవర్తన పట్టికలో 118 మూలలను 8.85సెకండ్లలో రికార్డు సృష్టించింది. కవితతో పాటు, గైడ్, ఉపాధ్యాయుడు కొలుగురి భాస్కర్‌రెడ్డికి టీపీఆర్టీయూ మండల శాఖ తరపున రూ.మూడు వేల ఆర్థిక సాయం, డిక్షనరీ, డ్రెస్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణరెడ్డి, బేగంపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి, రాయపోల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజ్, వడ్డేపల్లి ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, పీఆర్టీయూ, టీఎస్‌టీయూ మండల నాయకులు ఇంద్రసేనారెడ్డి, కనరారెడ్డి, తుల సీదాస్, నాగనాజు, నర్సింహులు, శ్రీనివాస్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కవితను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

జ్యోతిష్యం పేరుతో మోసం ..కేసు నమోదు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల, మార్చి 11: మండలంలోని కమలాయపల్లికి చెందిన ధర్మోజీ నారాయణచారి అనే వ్యక్తి నుంచి జ్యోతిష్యం పేరిట డబ్బులు వసూలు చేసిన ఏపీలోని గుంటూ రు జిల్లా పెద్దపలకనూరుకు చెందిన దక్షిణపు శివయ్యపై కేసు నమోదు చేసి మంగళవారం మద్దూరు పోలీసులు అరెస్టు చేసినట్లు చేర్యాల సీఐ శ్రీను తెలిపారు. నారాయణచారిని జ్యోతి ష్యం పేరిట మోసం చేసిన విధానాన్ని విలేకరులకు సీఐ వెల్లడించారు. ధర్మోజి నారాయణ జీటీవీ చూస్తుండగా జ్యోతిష్యం చెప్పబడును అని స్క్రోలింగ్ వచ్చిందని, అందులో దక్షిణపు శివయ్య ఫోన్ నెంబర్ వచ్చిందన్నారు. స్క్రోలింగ్ గమనించిన బాధితుడు తనకు ఇంట్లో ఇబ్బందులు ఉన్నాయని మనశ్శాంతి ఉండట్లేదు అని ఫోన్‌చేసి చెప్పడంతో శివయ్య జ్యోతిష్యం చెప్పించుకుని పూజలు చేస్తే అన్ని పోతాయన్నారు. వెంటనే నారాయణ అతడిని నమ్మి మొదటగా రూ. 50వేలు శివయ్య ఇచ్చిన అకౌంట్ నంబర్‌కు డిపాజిట్ చేశాడు. తర్వాత మరో వారం రోజులకు పూజారి ఫోన్ చేసి డబ్బులు సరిపోవడం లేదు, పూజ సగంలో ఉంది, పూర్తి కావాలంటే మరో రూ. 50వేలు కావాలని అడిగితే మరో రూ.50వేలను నారాయణ పంపించాడు. మరో వారం రోజుల తర్వాత పూజారి మళ్లీ ఫోన్ చేసి ఇంకా డబ్బులు కావాలని ఎక్కువ డబ్బులు ఇస్తేనే పూజ పూర్తవుతుందని, లేకపోతే చెడు జరుగుతుందని చెప్పడంతో అనుమానం వచ్చిన నారాయణ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. జాతకాల పేరుతో డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నట్లు దక్షిణపు శివయ్య ఒప్పుకున్నట్లు తెలిపారు. నేరస్తుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ సీజ్ చేయడంతో పాటు బాధితుడికి రూ. లక్ష రిఫండ్ చేయించినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. సీఐతో మద్దూరు ఎస్సై మహబూబ్ ఉన్నారు.

జర్నలిస్టును పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 11 : పట్టణానికి చెందిన జర్నలిస్టు కర్రోళ్ల నవజీవన్ ఇటీవల అనారోగ్యానికి గురై సిద్దిపేట పట్టణంలోని దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డి మంగళవారం ఆయన్ను ఫోన్‌లో పరామర్శించారు. బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటిని సిద్దిపేట దవాఖానకు పంపించి జర్నలిస్టు ఆరోగ్య విషయాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు.

సిద్దిపేటలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

సిద్దిపేట అర్బన్, మార్చి 11: సిద్దిపేట పట్టణ శివారులోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీపీ.రాజు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సదర్ ల్యాండ్ అనే కంపెనీకి సంబంధించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారని, ఇందులో 160 మంది విద్యార్థులు పాల్గొనగా మొత్తం 25 మంది ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఆర్ మేనేజర్ అనూష, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు ప్రవీణ్, గోపికృష్ణ, పీఆర్‌వో రఘు పాల్గొన్నారు.

రాయపోల్ తహసీల్దార్ బదిలీ

రాయపోల్, మార్చి 11: రెండేండ్లుగా రాయపోల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న దివ్య బదిలీపై వెళ్లారు. రాయపోల్ నూతన తహసీల్దార్‌గా డీఏవోఈగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కలెక్టర్ మనుచౌదరి ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 11: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మద్దూరు మండలంలోని లద్నూర్‌లో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మద్దూరు మండల కేంద్రానికి చెందిన పీఈటీ ఇంతియాజుద్దీన్ గ్రామంలోని హైస్కూల్‌కు బైక్‌పై ఓ బాలుడిని కూర్చోబెట్టుకొని వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని వివేకానంద విగ్రహం దగ్గరకు రాగానే ఎదురుగా రేబర్తికి చెందిన వద్యాణం మహేశ్ బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో ఇంతియాజుద్దీన్ కుడికాలు విరిగిపోగా మహేశ్ తలకు గాయంకావడంతో స్థానికులు 108లో సిద్దిపేట సర్కార్ దవాఖానకు తరలించారు. బాలుడికి స్వల్పగాయాలయ్యాయి.

ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా యాదగిరి

కొమురవెల్లి, మార్చి 11 : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా మంగళవారం కొమురవెల్లి మండలంలోని ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ముస్త్యాల యాదగిరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలతో పాటు అన్ని బకాయిలు చెల్లించాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జరిమానా

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి11: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తికి జరిమానా విధించినట్లు ధూళిమిట్ట తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ తెలిపారు. బైరాన్‌పల్లి వాగు నుంచి బెక్కల్‌కు చెందిన తిగుళ్ల నాగరాజు టీఎస్ 36ఎన్ 5143 నెంబర్ గల ట్రాక్టర్‌లో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సదరు వ్యక్తికి రూ. 10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

యువకుడి ఆత్మహత్య

రాయపోల్, మార్చి 11: జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బ్యాగరి శ్రీను (45) వ్యవసాయంతో పాటు హమాలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం గజ్వేల్‌లోని బంధువుల శుభాకార్యానికి హాజరై సాయంత్రం ఇంటికి వచ్చాడు. డబ్బులు ఇవ్వాలని భార్య చంద్రకళను అడగ్గా ఆమె నిరాకరించింది. జీవితంపై విరక్తి చెంది రాత్రి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

దుబ్బాక మున్సిపల్ బడ్జెట్ రూ.22.22 కోట్లు

దుబ్బాక, మార్చి11: దుబ్బాక పట్టణాభివృద్ధిలో భాగంగా దుబ్బాక మున్సిపల్ బడ్జెట్‌ను మంగళవారం సిద్దిపేట కలెక్టరెట్‌లో ప్రవేశ పెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్, దుబ్బాక ప్రత్యేకాధికారి గరిమా అగర్వాల్ సమక్షంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను అమోదించినట్లు తెలిపారు. 2025-26 సంవత్సరానికి సాధారణ నిధులు, ఇతర గ్రాంట్లు కలుపుకుని అంచనా ఆదాయం రూ.22.22 కోట్లు కాగా అంచనా వ్యయం రూ.22.19 కోట్లు కేటాయించినట్లు వివరించారు. పారిశుధ్య నిర్వహణ, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనా లు, విద్యుత్ చార్జీలు, రుణాల చెల్లింపు ఉంటుందని వివరించారు.